సాక్షి

మెదక్

బుధవారం, 4, అక్టోబర్, 2023



సాగులో.. సాంకేతికత

సంగారెడ్డి జిల్లా రైతులు పంట ఖర్చులు తగ్గించుకోవడానికి డ్రోన్‌లతో పిచికారీ చేస్తున్నారు.

వివరాలు 8లో ▸



చెట్ల నరికివేత

మైదానం అభివృద్ధి పేరిట గిరిజన గురుకులం అధికారులు చెట్లను తొలగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వివరాలు 9లో ▸

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: జిల్లా హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్‌లో అకౌంటెంట్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి బ్రహ్మాజీ తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పని చేసేందుకు అర్హులు ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

ఓటును వినియోగించుకోవాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

పాపన్నపేట(మెదక్): ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. పాపన్నపేట జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన మాక్ పోలింగ్‌లో ఆయన మాట్లాడారు. ఈవీఎం ఓటింగ్‌పై అవగాహన పెంచుకోవాలని, వచ్చే ఎన్నికల్లో 100 శాతం పోలింగ్ జరిగేలా కృషి చేయాలన్నారు. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి రాజిరెడ్డి, ప్రిన్సిపాల్ నర్సింలు, లెక్చరర్లు శ్రీనివాస్, సంతోష్ కుమార్, ప్రవీణ్ కుమార్, రమేష్, అరుణ, సంధ్యారాణి, విజయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

కష్టపడిన వారికి ప్రాధాన్యమేదీ?



రాజీనామా సమర్పించిన నాయకులు

రామాయంపేట(మెదక్): టికెట్ కేటాయింపు విషయమై కాంగ్రెస్ అధిష్టాన వైఖరికి నిరసనగా రామాయంపేట, నిజాంపేట మండలాల మండలాధ్యక్షులు, నాయకులు పలువురు రాజీనామాలు సమర్పించారు. మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో మంగళవారం రెండు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డికి మద్దతుగా మూకుమ్మడి రాజీనామాలు సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామాయంపేట, నిజాంపేట మండలాల అధ్యక్షులు శ్యాంరెడ్డి, లింగంగౌడ్ మాట్లాడుతూ.. అహర్నిశలు పార్టీ అభివృద్ధికి కృషి చేసిన తిరుపతిరెడ్డిని కాదని ఇతరులకు టికెట్లు అమ్ముకున్నారని ఆరోపించారు. రాజీనామా చేసిన వారిలో రెండు మండలాల అధ్యక్షులతో పాటు బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు, రామాయంపేట ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు తౌర్యానాయక్, కాంగ్రెస్ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పర్వతాపూర్, కాట్రియాల, కిషన్‌తండా, దంతేపల్లి, లక్ష్మాపూర్ గ్రామ శాఖల అధ్యక్షులు సురేందర్, మహేందర్‌రెడ్డి, లక్ష్మన్, యాదగిరి, ప్రవీణ్, నిజాంపేట ప్రధాన కార్యదర్శి మధుసుదన్‌రెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు నారాగౌడ్, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి విఠల్, తదితరులున్నారు.

ప్రమోషన్లు, బదిలీలు తప్పనిసరి

వెల్దుర్తి(తూప్రాన్): ఎస్జీటీ ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్ కొనసాగించకుండా బదిలీలు మాత్రమే చేస్తామనడం ఏమిటని ఎస్జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం ప్రశ్నించారు. మంగళవారం వెల్దుర్తిలో ఆయన మాట్లాడుతూ.. కోర్టు సాకు చూపుతూ ప్రమోషన్‌లు కాకుండా బదిలీలు మాత్రమే చేపడతామనడం సరికాదన్నారు. పదోన్నతులులేని ఎస్జీటీ, ఎల్‌పీ, పీఈటీల బదిలీలు ఒప్పుకోబోమన్నారు. అవసరమైతే విధులు బహిష్కరించి సహాయ నిరాకరణ చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు రమేశ్‌గౌడ్, రాములు, వెంకటరెడ్డి, రామాసేన్, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ విధానం రద్దు చేయండి



ధర్నా చేస్తున్న ఉద్యోగులు

మెదక్ కలెక్టరేట్: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 104 ఉద్యోగులు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ.. 104 ఎఫ్‌డీహెచ్‌ఎస్ ఉద్యోగులను రెగ్యులైజేషన్‌పై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, జీఓ 60 ప్రకారం స్లాబ్ పద్ధతిన వేతనాలు చెల్లించడంతో ఉద్యోగులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వ ఆధీనంలో పని చేస్తున్నా.. పనికి తగిన వేతనం అందడంలేదని, ఏజెన్సీ విధానం రద్దు చేసి ట్రెజరీ ద్వారా అందించాలని కోరారు. ఉద్యోగులు రాజు, భూపతి, అవినాష్ గౌడ్, రమేష్, రవి, సంజయ్, నూరుద్దీన్, మధు, దేవయ్య పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

రేగోడ్(మెదక్): పెద్దశంకరంపేట, రేగోడ్ మండలాల పరిధిలో చిరుత సంచరిస్తోందని ఫారెస్ట్ రేంజ్ అధికారి వికాస్ తెలిపారు. సోమవారం రాత్రి పెద్దశంకరంపేట, రేగోడ్ రోడ్డుపై చిరుత కనబడినట్లు ప్రయాణికుల ద్వారా తెలిసిందన్నారు. ఆనవాళ్లను సేకరిస్తున్నామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు పొలాల వద్దకు ఒంటరిగా వెళ్లొద్దని సూచించారు.

వైద్య విద్యకు శ్రీకారం

- మెదక్ మెడికల్ కళాశాల పనులకు ఏర్పాట్లు ముమ్మరం
- 30 ఎకరాల్లో.. రూ.180 కోట్లు
- రేపు మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా శంకుస్థాపన
- జిల్లాలో మెరుగుపడనున్న సర్కారు వైద్యం



మెడికల్ కళాశాల నిర్మించనున్న స్థలం

మెదక్: మెతుకు సీమగా పేరుగాంచిన మెదక్ జిల్లా త్వరలో వైద్య విద్యకు కేరాఫ్‌గా మారనుంది. స్పెషలిస్టులు లేక అత్యవసర వైద్యం కోసం ఇంతకాలం ఇతర ప్రాంతాలకు పరుగులు తీసిన ప్రజల కష్టాలు తప్పనున్నాయి. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి కృషితో జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు కావడంతో పాటు త్వరలో మెరుగైన వైద్యం స్థానికంగా అందనుంది. గత నెలలో సీఎం కేసీఆర్ మెదక్ పర్యటనలో మెడికల్ కళాశాల నిర్మాణానికి రూ.180 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన జీఓ విడుదల కావటంతో ఈ నెల 5న మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా కళాశాల పనులు ప్రారంభించేందుకు జిల్లా వైద్యాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అందుబాటులో 400 బెడ్స్

ఆస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలు, బెడ్స్, వైద్యుల నియామకం చేపట్టి ప్రభుత్వ వైద్యాన్ని మెరుగుపరిచేందుకు సర్కారు చర్యలు ప్రారంభించింది. జిల్లాకో మెడికల్ కళాశాలను మంజూరు చేసిన ప్రభుత్వం.. వైద్యశాలలకు కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తోంది. ప్రస్తుతం మెదక్‌లోఉన్న మాతా, శిశు ఆస్పత్రి పక్కనే 30 ఎకరాల్లో వైద్య కళాశాలను నిర్మించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పనులు పూర్తిచేసి వచ్చే ఏడాది నుంచి తరగతులు ప్రారంభించేందుకు జిల్లా వైద్యాధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే నర్సింగ్ కళాశాలకు స్థలం కేటాయించిన అధికారులు మెడికల్ కళాశాలతో పాటు వసతి గృహం పనులు వేగవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. నిబంధన ప్రకారం మెడికల్ కళాశాలకు భవనంతో పాటు 400 బెడ్స్ అందుబాటులో ఉండాలి. ప్రస్తుతం ఉన్న ఎంసీహెచ్‌లో 150 బెడ్స్ ఉండగా క్రిటికల్ కేర్ కోసం మరో 100 పడకల ఆస్పత్రితో పాటు జిల్లా ఆస్పత్రిలో 250 బెడ్స్‌తో ఉండాలి. ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలో 200 పడకలకు అప్‌గ్రేడ్ చేసినా మరో 50 పడకల ఆస్పత్రిని నిర్మించాల్సి ఉంది. మెడికల్ కళాశాల ఏర్పాటైతే అన్నిరకాల స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉంటారు. మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి చేసిన ప్రయత్నాల ఫలితంగా ఏర్పాటవుతున్న మెడికల్ కళాశాలతో జిల్లా ప్రజల చిరకాల కోరిక నెరవేరింది.

సీఎం కేసీఆర్ కృషితో ..



సీఎం కేసీఆర్, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు కృషితో మెడికల్ కళాశాల మంజూరైంది. వచ్చే ఏడాదిలో 100 మంది మెడికోలతో తరగతులు ప్రారంభిస్తాం. కళాశాల ఏర్పాటుతో జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుంది.

– పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే, మెదక్

అన్ని రకాల వైద్యసేవలు..



మెడికల్ కాళాశాల ఏర్పాటుతో అన్నిరకాల స్పెషలిస్టులు అందుబాటులో ఉంటారు. అన్ని రకాల వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందుతాయి. వైద్యం రంగంలో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

– చందూనాయక్, డీఎంహెచ్ఓ, మెదక్

ఎన్నికల నిర్వహణపై అవగాహన

కలెక్టర్ రాజర్షిషా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల నిర్వహణలో పాల్గొనే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు, ఎంసీఎంసీపై ఎన్నికల సిబ్బంది, ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన యాక్ట్‌లు, సెక్షన్‌లపై, వీవీ ప్యాట్, ఈవీఎంల పనితీరుపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. పెయిడ్, జనరల్ న్యూస్‌ను గుర్తించి వివరాలు నమోదు చేయాలని, రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, రెచ్చగొట్టే ప్రసంగాలు చేసేవారిపై నిఘా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్, తూప్రాన్, నర్సాపూర్ ఆర్డీఓలు జయచంద్ర, అంబదాస్ రాజేశ్వర్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు చర్యలతో పటిష్టత భద్రత

రాజన్న సిరిసిల్ల జోన్ డీఐజీ కె.రమేశ్‌నాయుడు



మాట్లాడుతున్న కె.రమేశ్‌నాయుడు

మెదక్ మున్సిపాలిటీ: ఎన్నికల సందర్భంగా ముందస్తు చర్యలతో భద్రతను పటిష్టం చేయాలని రాజన్న సిరిసిల్ల జోన్ డీఐజీ కె.రమేశ్‌నాయుడు అన్నారు. మంగళవారం మెదక్ నూతన పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. పోలీస్‌ల గౌరవ వందనం స్వీకరణ అనంతరం ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, అదనపు ఎస్పీ మహేందర్ ఆయనకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. కార్యాలయంలో వివిధ విభాగాలను సందర్శించి జిల్లాలో నమోదవుతున్న కేసులపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ స్థాయిలో ప్రణాళికలు తయారు చేసుకోవాలని, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకుల సహకారం తీసుకోవాలన్నారు. ఎలక్షన్ తేదీ ప్రకటించిన రోజు నుంచి ఫలితాలు వెలువడే వరకు అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ రోజు నిర్వహణ అంశాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ప్రసంగాలు, నినాదాలు, పోస్టర్స్ మొదలైన వాటికి సంబంధించిన మార్గదర్శకాలు, ప్రచార వ్యవధి, నియంత్రణ, మోడల్ ప్రవర్తన నియమావళి చట్టం తదితర అంశాలను సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీలు ఫణీంద్ర, యాదగిరి రెడ్డి, డీసీఆర్‌బీ పీ.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌బి సీఐ సందీప్ రెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కొత్త రుణంపై కొర్రీలు

- సొసైటీ నిబంధనలు
- ఆందోళనలో రైతులు



ఈ ఫొటోలో ఉన్న రైతు గాండ్ల కిషన్. కౌడిపల్లి మండలం మహ్మద్‌నగర్. కొన్నేళ్లుగా మహ్మద్‌నగర్ సొసైటీలో పంట రుణం తీసుకుని సాగు చేస్తున్నాడు. గతంలో డీసీసీబీ నుంచి తీసుకున్న రూ.1లక్ష రుణానికి మిత్తితో కలిపి రూ.1.46లక్షలు అయ్యాయి. ప్రభుత్వం రూ.1లక్ష మాఫీ చేయగా, మిగిలిన మిత్తి డబ్బులను చెల్లించాడు. కొత్త రుణం ఇవ్వాలని అధికారులను కోరితే.. నీది ప్రభుత్వ భూమి అని, రుణం ఇవ్వడం కుదరని చెప్పడంతో అవాక్కయ్యాడు. ఏళ్లుగా ఇదే సొసైటీలో రుణం తీసుకుంటున్నానని, కొత్తగా ఈ నిబంధనలు ఏమిటని వాపోతున్నాడు.



కౌడిపల్లి డీసీసీబీ

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూములకు రుణాలు ఇవ్వకపోవడంతో అర్హులైన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎస్‌బీఐతో పాటు ఇతర బ్యాంక్‌లకు లేని నిబంధనలు సొసైటీకి ఎందుని రైతులు ప్రశ్నిస్తున్నారు. పీఏసీఎస్‌లో రుణమాఫీ అయిన రైతులు తిరిగి రుణాల కోసం వెళితే.. పీపీ ల్యాండ్ అంటూ తిప్పి పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టా, ప్రభుత్వ భూమి ఉన్న రైతులకు మార్ట్‌గేజ్ చేసి రుణం ఇచ్చేవారని, ప్రస్తుతం సొసైటీలో పట్టాభూమికి మాత్రమే రుణం ఇస్తామని చెప్పడంతో అయోమయం చెందుతున్నారు. దీనిపై అధికారులను వివరణ కోరితే.. పీపీ ల్యాండ్ మార్ట్‌గేజ్ చేసేందుకు ధరణిలో ఆప్షన్ లేదని, అందుకే రుణం ఇవ్వడం లేదని చెబుతున్నారు.

చిన్న, సన్నకారు రైతులే..

జిల్లాలోని ఆయా మండలాల్లో చిన్న, సన్నకారు రైతులు ఏళ్లుగా పీపీ ల్యాండ్స్‌ను సాగుచేసుకుంటున్నారు. మహ్మద్‌నగర్ సొసైటీ పరిధిలో 1,160మంది రైతులకు ఇందులో ఖాతాలు ఉన్నాయి. సుమారు 60శాతం మంది రైతులు ప్రభుత్వ భూములు ఉన్నవారే. ఇప్పటికి 40 మంది రైతులు తమ ఖాతాలను ఇతర బ్యాంక్‌లకు మార్చుకున్నట్లు తెలిసింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో సొసైటీల పరిస్థితి ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది.

తీర్మానం చేసి పంపించాం

గతంలో ఇచ్చినట్లుగా సొసైటీ ద్వారా పీపీ ల్యాండ్స్‌కు పంట రుణాలు ఇవ్వాలని తీర్మానం చేసి డీసీసీబీ, రాష్ట్ర కమిటీకి, వ్యవసాయశాఖ మంత్రికి పంపించాం. మారిన నిబంధనల ప్రకారం పీపీ ల్యాండ్‌కు రుణం ఇవ్వలేమని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– గోవర్ధన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్

మార్ట్‌గేజ్ కానందునే...

గరైతుల భూమిని మార్ట్‌గేజ్ చేసి సొసైటీ నుంచి పంట రుణం అందిస్తున్నాం. ప్రభుత్వ భూము లకు ధరణిలో మార్ట్‌గేజ్ చేసే అవకాశం లేనందున కొత్త రుణాలు ఇచ్చేందుకు వీలుకావడంలేదు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– దుర్గాగౌడ్, సీఈఓ, మహ్మద్‌నగర్ సొసైటీ

కాంగ్రెస్‌లోనే కొనసాగుతాం..



మాట్లాడుతున్న బాలకృష్ణ

టీపీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ

మెదక్: పార్టీ అధికారంలో లేకున్నా 15 ఏళ్లపాటు జెండా కిందనే పని చేస్తున్నాం.. ఇక ముందు కూడా చేస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ద్వారక గార్డెన్‌లో నిర్వహించిన కార్యకర్తల ఆత్మగౌరవ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ వైఫ్యల్యాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించి, ప్రజల తరపున పోరాడామని, ఈ క్రమంలో మెదక్, రామయంపేట మండలాల పరిధిలో మాపై అనేక అక్రమ కేసులు పెట్టారని అన్నారు. కార్యకర్తలు ఆందోళనకు గురికావొద్దని, నియోజకవర్గాల్లో ఎక్కడా టికెట్లు కేటాయించలేదని చెప్పారు. కాంగ్రెస్ నుంచి టికెట్ ఎవరికి ఇచ్చినా అందరం కలిసి పని చేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో కష్ట పడ్డ వారికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కొత్తగా వచ్చిన వారు కార్యకర్తలను విస్మరిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెదక్ ఖిల్లాపై కాంగ్రెస్ జెండా ఖాయం

కాంగ్రెస్ నాయకుడు జీవన్‌రావు



మాట్లాడుతున్న కాంగ్రెస్‌నేత జీవన్‌రావు

మెదక్: ఓటమి భయంతోనే ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఈ నెల 2న ఏడుపాయలకు వస్తున్న మైనంపల్లి హన్మంతరావు, రోహిత్‌ను పోలీసులతో అడ్డుకున్నారని కాంగ్రెస్ నేత జీవన్‌రావు ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే భర్త దేవేందర్‌రెడ్డి ఏ అధికారంతో అధికారులతో సమీక్షలో పాల్గొంటారని ప్రశ్నించారు. తెలంగాణ కోసం అలుపెరగని పోరాటం చేశామని, ఎంతగా అణచివేయాలని చూస్తే అంత ఎత్తుకు ఎదుగుతామని అన్నారు. కార్యకర్తలే తమకు బలమని, వచ్చే శాసనసభ ఎన్నికల్లో మైనంపల్లి రోహిత్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని మెదక్ ఖిల్లాపై కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని స్పష్టం చేశారు.

నేడు మైనంపల్లి రాక...

బుధవారం ఉదయం 11 గంటలకు మైనంపల్లి హన్మంతరావు, రోహిత్‌లు ఏడుపాయలకు చేరుకొని అమ్మవారి దర్శనం చేసుకుంటారని రామాయంపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగా నరేందర్ తెలిపారు. అనంతరం మెదక్ దర్గా, చర్చిలో సైతం ప్రార్థనలు చేస్తారని, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పడాల సిద్ధిరాములు, రంగారావు, సాన సత్యనారాయణ, పోతరాజు మనోజ్, రాజాసింగ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కూత.. సంబరాల మోత





సిద్దిపేట స్టేషన్ వద్ద జనసందోహం, రైలులో ప్రయాణిస్తున్న మంత్రి హరీశ్‌రావు

దశాబ్దాల కల సాకారమైన వేళ..

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- సిద్దిపేటలో జెండా ఊపిన మంత్రి హరీశ్‌రావు
- భారీగా తరలివచ్చిన జనం



రైలు ముందు జెండాలతో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట ప్రజల దశాబ్దాల కల కళ్ల ముందు ఆవిష్కృతమైంది. ఎన్నో ఏళ్లుగా రైలు సౌకర్యం కోసం ఎదురుచూసిన క్షణాలు నిజమయ్యాయి. సిద్దిపేట–సికింద్రాబాద్ మధ్య రైలు ప్రయాణికులతో పరుగులు పెట్టింది. మంగళవారం నిజామాబాద్ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా, సిద్దిపేట రైల్వేస్టేషన్ వద్ద రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు జెండా ఊపి రైలును ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్, పరిసరాలను అందంగా ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రైలు వద్ద సెల్ఫీలు దిగుతూ మురిసిపోయారు. కొంత మంది సరదాగా రైలులోకి ఎక్కారు. బీఆర్ఎస్ కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటూ మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు దుద్దెడ స్టేషన్ వరకు రైలులో ప్రయాణించారు. తొలి ప్రయాణంలో 327 మంది ప్రయాణించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఫారుఖ్ హుస్సేన్, జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, ర్తలు పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది



సిద్దిపేటకు రైలు సౌకర్యం రావడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం సుమారు మూడున్నర గంటలు పడుతోంది. దీనిని గంటన్నరకు తగ్గించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. రైలు సౌకర్యాన్ని ప్రజలు వినియోగించుకునేలా చూడాలి.

– భాస్కర్, ప్రయాణికుడు

సౌకర్యం మెరుగుపర్చాలి



రైలు సౌకర్యం ఏర్పడటంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి సాధిస్తుంది. రైల్వే స్టేషన్‌కు రావడానికి సరైన రోడ్డు మార్గం, ఆటో సౌకర్యం సరిగా లేవు. అధికారులు రవాణా సౌకర్యం మెరుగుపరిస్తే రైలు సేవలను ప్రజలు వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

– సత్యనారాయణ, ప్రయాణికుడు, సిద్దిపేట

గుర్తుండిపోయే జ్ఞాపకం..



సిద్దిపేట నుంచే రైలులో ప్రయాణించడం ఎప్పటికీ గుర్తిండిపోయే జ్ఞాపకం. రైలు సౌకర్యం కల్పించిన మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు సైతం రైలు సౌకర్యాన్ని కల్పించాలి. సామాన్యులకుఎంతో మేలు కలుగుతుంది.

– అమర్, ప్రయాణికుడు

క్లుప్తంగా

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా రాజ్‌కుమార్


రాజ్‌కుమార్

హుస్నాబాద్‌: ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా జనగామ రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ నెల 1న అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య 3వ మహాసభలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర పాల్గొన్నారు. అయితే మంగళవారం నూతన కమిటీ ప్రకటించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా జనగామ రాజ్‌కుమార్, జిల్లా కార్యదర్శిగా కనుకుంట్ల శంకర్, జిల్లా ఉపాధ్యక్షులుగా కుడిక్యాల రాజు, బిచ్చాల శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా మిట్టపల్లి సుధాకర్, కందుకూరి అంకయ్య, జిల్లా కోశాధికారిగా రాయికంటి మంజులతో పాటుగా 15 మంది కార్యవర్గ సభ్యులు, 21 మంది కౌన్సిల్ సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

అర్హులందరికీ రుణమాఫీ

- ఎస్‌బీఐ రిలేషన్‌షిప్ మేనేజర్ సంతోష్


మాట్లాడుతున్న రిలేషన్ షిప్ మేనేజర్ సంతోష్

చేర్యాల(సిద్దిపేట): 2018 డిసెంబరుకు ముందు రుణం పొందిన రైతులందరికీ ప్రతి కుటుంబానికి రూ.లక్ష రుణమాఫీ వస్తుందని ఎస్‌బీఐ రిలేషన్ షిప్ మేనేజర్ సంతోష్ తెలిపారు. స్థానిక ఎస్‌బీఐ ఏడీబీ శాఖలో మంగళవారం ఆయన బ్రాంచి మేనేజర్ శ్రీలతతో కలిసి విలేకరులకు వివరాలు తెలిపారు. గతంలో రుణం పొందిన కొందరు రైతులకు చెందిన ఖాతాలు క్లోజ్ చేశామని, అందుకే కొందరికి రుణమాఫీ జమకాలేదన్నారు. అలాంటి రైతులకు తిరిగి రుణమాఫీ జమ అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రుణమాఫీ వర్తిస్తుందన్నారు.

బాలుడికి అరుదైన శస్త్ర చికిత్స


మాట్లాడుతున్న డాక్టర్ మనీశ్‌కుమార్ జైన్

సిద్దిపేటకమాన్: సైకిల్ ప్రమాదంలో రక్త ప్రసరణ కోల్పోయి చేతిని పోగొట్టుకోవాల్సిన బాలుడికి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సచేసి మామూలు స్థితికి తెచ్చారు. బాలుడికి శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యుడు మనీశ్‌కుమార్ జైన్ స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సమావేశం నిర్వహించి వివరాలు తెలిపారు. జిల్లా పరిధిలోని చిన్నగుండవెల్లి గ్రామానికి చెందిన ఉడుత రామ్‌చరణ్ ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఆగస్టు 30న రాంచరణ్ సైకిల్‌పై నుంచి పడడంతో చేతికి తీవ్రగాయమయింది. పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ అత్యాధునిక, అరుదైన శస్త్ర చికిత్సలు నిర్వహించి బాలుడి చేతిని మాములు స్థితికి తీసుకువచ్చినట్లు మనీశ్‌కుమార్ జైన్ తెలిపారు. రామ్‌చరణ్ తండ్రి రైతు కావడంతో తక్కువ ఖర్చుతో వైద్యం అందించినట్లు చెప్పారు. సమావేశంలో ఆసుపత్రి ప్రతినిధులు రాజిరెడ్డి, నరేందర్, స్థానిక వైద్యుడు సముద్రాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు ఎత్తివేయాలని ఫిర్యాదు


ఎక్సైజ్ అధికారికి ఫిర్యాదు చేస్తున్న రాములు నేత

జహీరాబాద్ టౌన్: శాంతినగర్‌లో నడుస్తున్న బెల్ట్‌షాపులను ఎత్తివేయించాలని ఎక్సైజ్ శాఖ రాష్ట్ర ఉన్నత అధికారికి మాజీ కౌన్సిలర్ రాములు నేత ఫిర్యాదు చేశారు. హైదారాబాద్‌లోని కార్యాలయంలో మంగళవారం ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దినసరి కూలీలు నివాసం ఉండే శాంతినగర్ ప్రాంతంలో ఏడు బెల్ట్‌షాపులు నడుస్తున్నాయన్నారు. అక్రమంగా మద్యం అమ్మడం వల్ల అనర్థాలు జరుగుతున్నాయని, ఇటీవల ఒకరి హత్య కూడా జరిగిందన్నారు. తాగుబోతుల ఆగడాలు అధికమైయ్యాయని, మహిళలు రోడ్డుపై తిరలేకపోతున్నారని వాపోయారు. స్థానిక ఎక్సైజ్ సీఐ, ఎస్‌ఐలకు ఫిర్యాదు చేయగా పట్టించుకోవడంలేదన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

పట్టణంలో దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయిస్తాం. మురుగు కాల్వల పారుదల సవ్యంగా సాగేందుకు చర్యలు తీసుకుంటాం. ఎవరు కూడా ఖాళీ ప్లాట్లలో చెత్త పడవేయవద్దు. చుట్టుపక్కల నివాసితులు అదే వ్యాధులకు కారకం కావచ్చు. పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుంది. నారాయణఖేడ్ మున్సిపాలిటీ స్వచ్ఛతకు అందరూ కృషి చేయాలి.

- ఫాగింగ్ చేయిస్తున్నాం
- పందులు, కుక్కల బెడదను నివారిస్తాం
- ఫోన్ ఇన్‌లో మేనేజర్ వెంకట శివయ్య



నారాయణఖేడ్ : పట్టణం సుందరంగా ఉండేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. సమష్టి కృషితో పట్టణాన్ని క్లీన్ సిటీగా మార్చేందుకు ప్రజలు సహకరించాలి అని మున్సిపల్ మేనేజర్ తెలిపారు. ఖేడ్ మున్సిపాలిటీలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలపై మంగళవారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్‌ఇన్ నిర్వహించింది. మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్‌తో కలిసి ప్రజలు విన్నవించిన సమస్యలకు జవాబునిచ్చారు. కార్యక్రమానికి పట్టణవాసుల నుంచి అనూహ్య స్పందన లభించింది.

◆ రైతుబజార్ దగ్గర మురుగు కాల్వపై భారీ గుంత తవ్వి వదిలేశారు. ఈ దారిగుండా విద్యార్థులు, జనాలు రాకపోకలు సాగిస్తున్నారు.
(నరేందర్, నవీన్, రైతుబజార్ దగ్గర)

మేనేజర్: మురుగు ప్రవాహానికి ఇబ్బందికరంగా మారడంతో తవ్వారు. త్వరలో మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం.

◆ మంగల్‌పేట్‌లో పందుల బెడద అధికమైంది. స్ట్రీట్ లైట్లను కూడా ఏర్పాటు చేయాలి.
(శివకుమార్, మంగల్‌పేట్)

మేనేజర్: త్వరలో వాటి తరలింపునకు చర్యలు తీసుకుంటాం. లైట్లను కూడా ఏర్పాటు చేయిస్తాం.

◆ బైపాస్ రోడ్డులోని గాంధీచౌక్ సమీపంలో గోతులు పడటంతో బురద నిల్వ ఉంటోంది.
(సంగప్ప, గాంధీచౌక్)

మేనేజర్: రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు తొలగింజేయిస్తాం. త్వరలో సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుంది.

◆ వివేకానంద కాలనీలో ఉన్న మురుగు కాలువపై.. పైకప్పు లేక ప్రమాదకరంగా తయారైంది.
(మాదపాటి నరేష్, వివేకానంద కాలనీ)

మేనేజర్: చైర్మన్, కమిషనర్ దృష్టికి సమస్య తీసుకెళతాం. అవసరమైన చోట కల్వర్ట్ నిర్మాణానికి కృషి చేస్తాం.

◆ మా కాలనీలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు భారీగా పెరిగాయి.
(రాంచందర్, భూమయ్య కాలనీ)

మేనేజర్: ఇరువైపులా తొలగింపజేయిస్తాం.

◆ ప్లాటులో చెత్తాచెదారంతోపాటు మురుగు నీరు నిల్వ వల్ల దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.
(శ్రీనివాస్, వివేకానంద స్కూల్ కాలనీ)

మేనేజర్: ప్లాటు యజమానికి గతంలోనే నోటీసు ఇచ్చాం. చెత్త తొలగించేలా చర్యలు తీసుకున్నాం. ఇంకోసారి నోటీసు ఇస్తాం. పారిశుద్ధ్య సిబ్బంది అక్కడికి చేరుకొని మురుగును తొలగిస్తారు.

◆ బైపాస్‌రోడ్డులో 10 ఫీట్ల రోడ్డు ఉంది. ఆలయానికి వెళ్లే ఈ దారిలో సీసీ రోడ్డు లేదు. తాగునీటి పైప్‌లైన్ లికేజీ అవుతోంది. దీంతో రోడ్డు బురదమయంగా మారుతోంది.
(నర్సింహారెడ్డి, సత్తయ్య, భూమయ్యకాలనీ)

మేనేజర్: తాగునీటి పైప్‌లైన్‌నకు మరమ్మతు చేయిస్తాం. సీసీ రోడ్డు సమస్యను చైర్మన్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్తాం. రోడ్డుపై మురుగు రాకుండా చూస్తాం.

◆ బైపాస్ రోడ్డులోని శివానగర్ కాలనీలో దోమల బెడద అధికంగా ఉంది. పిచ్చిమొక్కలు సైతం భారీగా పెరిగిపోయాయి. మురుగు సమస్య కూడా ఉంది. (గణేష్, శివానగర్ కాలనీ)

మేనేజర్: దోమల నివారణకు వెంటనే ఫాగింగ్ చేయిస్తాం. పిచ్చిమొక్కలను తొలగింపజేస్తాం. మురుగు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటాం.

◆ పందులు, దోమల బెడద అధికంగా ఉంది.
(యూసుఫ్, సాయిబాబా కాలనీ)

మేనేజరు: దోమల బెడద నివారణకు వెంటనే ఫాగింగ్ చేయిస్తాం. గతంలో పందులను తరలించే ప్రక్రియను చేపట్టాం. ఇంకోసారి చర్యలు తీసుకుంటాం.

◆ రహమాన్ కాలనీలో వంద మీటర్ల సీసీ రోడ్డు వేయలేదు. వర్షాలు కురిసిన సమయంలో ఇబ్బందవుతోంది.
(మహమ్మద్ ఆరీఫ్, రహమాన్ కాలనీ)

మేనేజర్ : వందమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణంపై చైర్మన్, కమిషనర్ దృష్టికి సమస్యను తీసుకెళతాం.

◆ ఏఎస్‌నగర్ కాలనీలో సీసీ రోడ్ల సమస్యలు నెలకొన్నాయి. ముఖ్యంగా మిషన్ భగీరథ పథకం పైప్‌లైన్ పూర్తిగా కాలనీలకు రాలేదు. పలు స్తంభాలకు లైట్లు వెలగడం లేదు.
(విద్యానంద్, ఏఎస్ నగర్ కాలనీ)

మేనేజర్ : మిషన్ భగీరథ పథకం పైప్‌లైన్ సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళతాం. ఇదివరకే వీధిలైట్లు ఏర్పాటు చేశాం. పట్టణ ప్రగతిలో భాగంగా అదనపు లైట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. రోడ్ల సమస్యలను చైర్మన్, కమిషనర్ దృష్టికి తీసుకెళతాం.

◆ బైపాస్ రోడ్డులోని సేవాలాల్ చౌక్ సమీపంలోని సుజల వాటర్ ప్లాంట్ సమీపంలో మురుగు కాలువ ధ్వంసమైంది.
(బిరాదర్ నాగ్‌నాథ్, 4వ వార్డు)

మేనేజర్: నూతన కాల్వ నిర్మాణం గూర్చి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం.

◆ మురుగు సమస్య తీవ్రంగా ఉంది. ప్లాట్లలో మురుగు పారుతోంది.
(దుర్గం నర్సింహులు, జేజీకే ఆస్పత్రి వెనుక కాలనీ)

మేనేజర్: పారిశుద్ధ్య సిబ్బంది అక్కడికి చేరుకొని మురుగు తొలగిస్తారు.

◆ పోలీస్ స్టేషన్ వెనుక గల్లీలో ఉన్న ఖాళీ ప్రదేశంలో చెత్త పడేస్తున్నారు. దుర్గంధం వెదజల్లుతోంది.
(బి.కృష్ణ, పోలీస్ స్టేషన్ వెనుకగల్లీ వాసి)

మేనేజర్ : ఖాళీ ప్రదేశంలో చెత్త పడవేయకుండా చర్యలు తీసుకుంటాం.

◆ రామమందిరం వెనుకాల ముళ్ల పొదలు విపరీతంగా పెరిగిపోయాయి. దోమల బెడద కూడా అధికమైంది. (సూర్‌రెడ్డి, వడ్లగల్లీ)

మేనేజర్ : పారిశుద్ధ్య సిబ్బంది అక్కడికి వచ్చి తొలగిస్తారు. దోమల నివారణకు వెంటనే ఫాగింగ్ చేయిస్తాం.

◆ పైప్‌లైన్ లికేజీల వల్ల తాగునీటి సరఫరా కావడం లేదు. కాలనీలో ఉన్న రోడ్డు అధ్వానంగా ఉండటంతో నడవాలంటే భయమేస్తోంది.
(మల్లయ్య, వివేకానందకాలనీ)

మేనేజరు: లైన్‌మెన్‌ను పంపి తాగునీటి లికేజీలను నివారిస్తాం. సీసీ రోడ్డు నిర్మాణం గూర్చి మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకెళతాం.

◆ సువర్ణ థియేటర్ రోడ్డులోని ఏఎస్ నగర్ కాలనీల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల సమస్యలు అధికంగా ఉన్నాయి. పందుల బెడద కూడా నెలకొంది. (బుగుడాల రాములు, సత్యనారాయణ, సంతోష్‌కుమార్, నిర్మల, ఏఎస్ నగర్‌కాలనీ)

మేనేజర్: పందులను ఇదివరకు తరలించాం. ఇంకోసారి తరలింపునకు చర్యలు తీసుకుంటాం. సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం గూర్చి చైర్మన్, కమిషనరు దృష్టికి తీసుకెళతాం.

◆ లోవోల్టేజీ సమస్య ఉంది. విద్యుత్ పరికరాలు కాలిపోతున్నాయి. సర్దార్, టీచర్, అంబోజీ కాలనీ

మేనేజర్: సమస్యను వెంటనే ట్రాన్స్‌కో ఏఈ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తాం.

సాగులో.. సాంకేతికత

- డ్రోన్ సహాయంతో పురుగుమందుల పిచికారీ
- రోజుకు 25 నుంచి 30 ఎకరాల్లో చేసే వీలు
- కూలీల కొరతను అధిగమించే అవకాశం


పురుగు మందు పిచికారీ చేస్తున్న డ్రోన్

సంగారెడ్డి టౌన్: పంట సాగులో ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు కూలీల సమస్యను అధిగమించి అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు యాంత్రీకరణ వైపు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా డ్రోన్‌లను వినియోగించడానికి ఆసక్తి చూపుతున్నారు. ఎరువులు, పురుగు మందుల పిచికారీకి కూలీలు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. దీంతో ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు కూలీల సమస్యను అధిగమించి అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు సాంకేతికత బాట పడుతున్నారు. మందులు పిచికారీ చేసేందుకు డ్రోన్‌లు చాలా ఉపయోగపడుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే చాలా మంది రైతులు డ్రోన్‌లను వినియోగించడం విశేషం.

డ్రోన్ వినియోగంతో ప్రయోజనాలెన్నో..

ఎకరా విస్తీర్ణంలో పురుగు మందుల పిచికారీ ఆరు నిమిషాల్లో పూర్తవుతుంది. ఎరువులకైతే 12 నిమిషాల సమయం పడుతుంది. అంతే కాకుండా రోజుకు 2530 ఎకరాల్లో పిచికారీ చేసేందుకు వీలు ఉంటుంది. మనుషులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. డ్రోన్ ద్వారా ఎరువులు, పురుగు మందులు ఒకేసారి పిచికారీ చేయడం ద్వారా సులభంగా, చీడపీడల నివారణ అవుతుంది. ఎత్తు పల్లాలతో కూడిన పంట పొలాల్లోనూ సులభంగా మందులు చల్లవచ్చు. డ్రోన్ల ద్వారా పురుగుమందుల పిచికారీకి ఎకరాకు రూ.500 నుంచి రూ.1000 వరకు ఖర్చవుతుంది. అదే కూలీకైతే రూ.800 రూ.1500) వరకు చెల్లించాల్సి వస్తుంది. రిమోట్ సాయంతో పనిచేసే ఈ డ్రోన్‌ల వల్ల పురుగు మందుల వృథా తగ్గడమే కాకుండా తగినంత ఎత్తు నుంచి పిచికారీ చేయడంతో సాగుకు సక్రమంగా మందు అందుతుంది.

రోజుకు రూ.5 వేలు ఆదాయం..



పంట సాగులో కూలీల కొరతను అధిగమించేందుకు రెండేళ్ల క్రితం డ్రోన్ కొనుగోలు చేసి దాని ద్వారా పంటకు మందులను పిచికారీ చేస్తున్నాను. డ్రోన్ పిచికారీతో రోజుకు రూ.5 వేల వరకు ఆదాయం కూడా వస్తోంది.
– ఆత్మకూరు మల్లేష్, ఇరిగిపల్లి, సంగారెడ్డి

అవరోధాలు లేకుండా అభివృద్ధి

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: అన్ని పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఏ అవరోధాలు లేకుండా నిర్వహించాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఆమె ఎంపీడీవో, ఎంపీవో, విద్యుత్ శాఖ ఈఆర్‌వో, ఏఈలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీలలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు అవరోధాలు లేకుండా అధికారులు చూడాలన్నారు. మండలాల వారిగా పెండింగ్లో ఉన్న విద్యుత్ బకాయిలు త్వరగా చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ, పంచాయతీ, వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనం వంటి అన్ని ప్రభుత్వ కార్యకలాపాల విద్యుత్ బకాయిలు త్వరగా చెల్లింపులు జరపాలన్నారు. ఆస్తి పన్ను, ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. విద్యుత్ బకాయిలు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్న మండలాల్లో డీపీవో, అధికారులు వేగంగా చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీపీవో దేవకిదేవి, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి అజయ్‌మిశ్రాను బర్తరఫ్ చేయాలి

రైతు సంఘం నాయకుల డిమాండ్


నిరసన కార్యక్రమంలో సీపీఐ నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): లఖీంపూర్‌ఖేరీలో రైతులను చంపిన అజయ్‌మిశ్రాను మంత్రి వర్గం నుంచి భర్తరఫ్‌చేసి హత్యానేరం కేసు నమోదు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రెడి, సీపీఐ పట్టణ కార్యదర్శి పి.వినోద డిమాండ్ చేశారు. పట్టణంలో రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వారు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర తీసుకువచ్చిన మూడు నల్లచట్టాలను ఉపసంహరించాలని నిరసన చేస్తున్న రైతులపై అజయ్‌మిశ్రా తన వాహనంతో రైతులను తొక్కించి చంపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనను మంత్రి వర్గం నుంచి తొలగించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తాజోద్దిన్, ఎండీ సాధిక్‌అలీ, యాకుబ్, రాజన్న, శివకుమార్, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల శిక్షణ ఫలవంతం

నాచగిరిలో ముగిసిన శిబిరం


చివరిరోజు హాజరైన అర్చకులు

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన నాచారంగుట్ట నాచగిరి శ్రీలక్ష్మీనృసింహక్షేత్రంలో మూడు రోజులపాటు కొనసాగిన ధూపదీప నైవేద్య అర్చకుల శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. చివరిరోజు వైదికస్మార్త ఆగమంపై తరగతులు జరిగాయి. షోడషోపచార పూజలు, బ్రహ్మోత్సవాలు, ఉత్సవాల విధి విధానం తదితర అంశాలు వివరించారు. జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ శివరాజ్, ఆలయ ఏసీ అన్నపూర్ణ శిక్షణ తరగతులను పర్యవేక్షించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన ధూపదీప నైవేద్య అర్చకులకు పునశ్చరణ తరగతులు ఫలవంతంగా ముగిశాయని వారు చెప్పారు.

హాట్‌స్పాట్‌ల వద్ద నిరంతరం నిఘా

– సిద్దిపేట సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: జిల్లాలోని హాట్‌స్పాట్‌ల వద్ద షీటీమ్స్‌తో నిరంతరం నిఘా ఏర్పాటు చేసినట్లు సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ జిల్లాలో షీటీమ్స్‌తో మహిళలకు, బాలికలకు భద్రత, భరోసా కల్పిస్తున్నట్లు చెప్పారు. షీటీమ్స్ ఆగస్టులో 43 మంది ఆకతాయిలను పట్టుకుని కేసులు నమోదు చేసి కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్‌ల వారిగా షీటీమ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలు వేదింపులకు గురైతే డయల్ 100, సిద్దిపేట పోలీసు కంట్రోల్ రూం 8712667100కు ఫోన్‌చేసి సేవలు పొందవచ్చని చెప్పారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్


జెండా ఊపి 'చలో'కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రవీణ్‌కుమార్

సదాశివపేట(సంగారెడ్డి): మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వి.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనాలతో పాటు వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా తరలివెళ్లారు. ఆయన మాట్లాడుతూ పక్క రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు ఇస్తున్నా మన రాష్ట్రంలో ఎందుకు అమలు జరుపడం లేదని ప్రశ్నించారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు, ప్రమాదంలో మరణిస్తే రూ.25 లక్షలు ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టి దహన సంస్కారాలకు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చౌదరి మనీష్, నాగేష్, రవికుమార్, నర్సింలు, రాజు, పాపయ్య, కిషోర్, బాల్‌రాజ్, శ్రీను, రుక్కమ్మ, అమృతమ్మ, లక్ష్మి, మమత తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

కొండపాక(గజ్వేల్): మతిస్థిమితం లేని యువకుడు యామ చందు (22) అదృశ్యమైనట్ట కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు. కొండపాక మండలంలోని జప్తినాచారం గ్రామానికి చెందిన యామ ఐలయ్య కుమారుడు యామ చందు ఐదేళ్ల వయస్సులో మతి స్థిమితం కోల్పోయాడు. ఈ క్రమంలో గత 29న ఇంటి నుంచి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని ఎస్‌ఐ తెలిపారు. దీంతో చందు తండ్రి ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పుష్పరాజ తెలిపారు. 5.2 అగుడుల పొడవు, నల్లటి రంగు, కోల ముఖంతో ఉన్న యువకుడు కనిపిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు తప్పిన ప్రమాదం

స్కూల్ బస్సును ఢీకొన్న కారు


బస్సులో విద్యార్థులు

తూప్రాన్: ఒక ప్రైవేట్ స్కూల్ బస్సును కారు ఢీకొన్న ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగక పోవడంతో పెను ప్రమాదం తప్పినట్టయింది. ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు గీతా కళాశాల వద్ద మలుపు తిరుగుతున్న సమయంలో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో కారు ముందు భాగం ధ్వంసం అయింది. బస్సులో ఉన్న సుమారు 30 మంది విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది. సంఘటన స్థలాన్ని సందర్శించి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు. 44వ జాతీయ రహదారిపై గీతా కళాశాల సమీపంలో రహదారిపై డివైడర్ ప్రమాదకరంగా మారింది. ఆ ప్రాంతంలో ప్రస్తుతం వంతెన నిర్మాణం కోసం పనులు జరుగుతుండడంతో డివైడర్ వద్ద రాకపోకలను తాత్కలికంగా మూసివేశారు. సమీపంలోని గీతా కళాశాల ఎదురుగా ఉన్న మలుపు నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అక్కడ నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, హైవే అధికారులు అక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్, ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయలేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తలనొప్పి తాళలేక యువతి ఆత్మహత్య

తొగుట(దుబ్బాక): తలనొప్పి భరించలేక యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఎల్లారెడ్డిపేటలో మంగళవారం చోటుచేసుకుంది. తొగుట ఎస్‌ఐ లింగం కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోడలి మల్లేశం, నర్సవ్వ కుమార్తె శిరీష(20) ఐదు ఏళ్ల క్రితం ప్రమాదంలో గాయపడింది. అప్పటి నుంచి ఆమె తరచూ తలనొప్పితో బాధపడుతోంది. అయితే మంగళవారం ఉదయం తలనొప్పిగా ఉందని తల్లికి చెప్పింది. ఆసుపత్రికి వెళ్దాం అని చెప్పి ఆమె వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చేసరికి శిరీష ఇంట్లోని ఫాన్‌కు ఉరేసుకుని ఉండడం గమనించారు. తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ వివరించారు.

ఎలుకల మందు తాగి బాలిక..

వెల్దుర్తి(తూప్రాన్): తల్లి మందలించడంతో ఎలుకల మందు తాగి కుమార్తె ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రామాయిపల్లిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ వసురాం తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రాపర్తి లాలు, స్వప్న దంపతులకు ఇద్దరు కుమార్తెలు, పెద్ద కుమార్తె వివాహంకాగా, చిన్న కుమార్తె మేఘమాల(16) కరోనా అనంతరం చదువు మానేసి ఇంట్లోనే ఉంటుంది. సోమవారం ఉదయం ఇంట్లో డబ్బులు కనిపించక పోవడంతో తల్లి కూతుళ్ల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి మేఘమాల నురగలు కక్కుతూ కనిపించింది. ఎలుకల మందు తాగిందని గమనించిన వారు మెదక్ ఆసుపత్రికి తరలించగా మంగళవారం వేకువ జామున చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ వసురాం తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఏడుగురు మృతి

టిప్పర్ ఢీకొని మాజీ ఉపసర్పంచ్..


కిషన్(ఫైల్)

హవేళిఘణాపూర్ (మెదక్): మెదక్ నుంచి పనులుగు ముగించుకొని ఇంటికి బైక్‌పై వెళ్తున్న శమ్నాపూర్ మాజీ ఉప సర్పంచ్‌ను ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఔరంగాబాద్ చౌరస్తా సమీపంలో చోటు చేసుకుంది. శమ్నాపూర్ గ్రామానికి చెందిన రామతీర్థం కిషన్(50) మంగళవారం రాత్రి మెదక్‌వైపు నుంచి స్వగ్రామం శమ్నాపూర్‌కు బైక్‌పై వెళ్తుండగా ఔరంగాబాద్ తండా గేటు సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో కిషన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనను మెదక్ ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో కార్యదర్శి సంధ్యారాణి...


సంధ్యారాణి (ఫైల్)

రామాయంపేట(మెదక్): మండలంలోని దామరచెరువు గ్రామ కార్యదర్శి కొత్త సంధ్యారాణి(38) మంగళవారం మృతి చెందారు. వారం రోజుల క్రితం అస్వస్థతకు గురైన ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంధ్యారాణి బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందినట్లు సర్పంచ్ శివప్రసాదరావు తెలిపారు. మూడేళ్లుగా గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. సంధ్యారాణి మృతికి పలువురు సంతాపంగా గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

అనారోగ్యంతో విద్యార్థిని...


వైష్ణవి (ఫైల్)

రేగోడ్(మెదక్): అనారోగ్యంతో బాలిక మృతి చెందిన ఘటన మెదక్ జిల్లాలోని రేగోడ్ మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన రైతు కిష్టయ్య కుమార్తె వైష్ణవి (14) స్థానిక మోడల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఇటీవల వైష్ణవికి జ్వరం రావడంతో నారాయణఖేడ్ ఆస్పత్రిలో చికిత్సచేయించారు. అయినా ఫలితం లేకపోవడంతో 29న హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. సోమవారం వైష్ణవి మృతి చెందింది. ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు గ్రామానికి వెళ్లి వైష్ణవిని చూసి బోరున విలపించారు.

బోరుమోటార్ తీయబోయి..

హవేళిఘణపూర్(మెదక్): మంజీరాలో కాలిపోయిన మోటార్‌ను తీసే క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సర్దన గ్రామశివారు మంజీరలో మంగళవారం చోటు చేసుకుంది. సర్దన గ్రామానికి చెందిన కట్ట కిషన్(54) మంజీర నదిలో శివారులో ఉన్న పొలం వద్దకు వెళ్లారు. మంజీరా నదిలో ఉన్న బోరు మోటార్ సరి చేసే క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. కిషన్ రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో పొలం వద్ద వెతుకగా ఒడ్డున ఆయన బట్టలు కనిపించడంతో నదిలో గాలించగా మృతదేహం లభించింది. హవేళిఘణాపూర్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కిషన్ భార్య దుర్గవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మేస్త్రీ మృతి

పటాన్‌చెరు టౌన్: భవన నిర్మాణ పనుల్లో భాగంగా ఐరన్ రాడ్‌లను తీసుకెళ్తుండగా విద్యుత్ తీగలకు తగలడంతో షాక్ తగిలి ఒక మేస్త్రీ మృతి చెందాడు. అమీన్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం చత్తీస్‌గఢ్‌కి చెందిన సునీల్ కుమార్ సాహూ(30) మూడేళ్ల నుంచి అమీన్‌పూర్ పరిధిలోని కృష్ణనగర్‌లో మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మధురనగర్ కాలనీలో లేబర్ కాంట్రాక్టర్ బెల్లం కొండ మల్యాద్రికి చెందిన భవన నిర్మాణం పనులు చేస్తున్నాడు.

అయితే సోమవారం రాత్రి పనుల్లో భాగంగా సునీల్ కుమార్ ఇనుప రాడ్‌లను పైకి తీసుకెళ్తున్న క్రమంలో మొదటి అంతస్తుకు చేరగా అక్కడ ఉన్న విద్యుత్ తీగలకు రాడ్‌లు తాకడంతో విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయాడు. అతడిని వెంటనే అశోక్‌నగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే లేబర్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే సునీల్ కుమార్ మృతి చెందాడని అతడి బంధువు కీర్తన్ సాహూ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి...

హత్నూర(సంగారెడ్డి): చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన హత్నూర మండలంలోని దౌలాపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చింత లింగయ్య (65) ఎప్పటిలాగే గ్రామ శివారులోని వాగులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృత్యువాత పడ్డాడు. దీంతో గమనించిన స్థానికులు వెంటనే మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరుబయట నిద్రిస్తున్న వ్యక్తి..


మృతి చెందిన రాజు

మెదక్ మున్సిపాలిటీ: దాయరకాలనీలో ఆరుబయట నిద్రిస్తున్న ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... దాయర వీధికి చెందిన ఎర్రొల్ల రాజు(32) ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి భోజనంచేసి ఇంటి ముందు ఉన్న అరుగుమీద పడుకున్నాడు. దీంతో ఉదయం లేపడానికి ప్రయత్నించగా మృతి చెంది ఉన్నట్టు కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజు శరీరం నలుపురంగులోకి మారడంతో ఏదైనా విషపురుగు కాటు వేయడంతో మృతి చెంది ఉంటాడని ఎస్‌ఐ పోచయ్య అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

సాక్షి మెదక్

గురువారం । 5 । అక్టోబర్ । 2023



తండాల అభివృద్ధికి పెద్దపీట

గిరిజన తండాల అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమయ్యాయని గిరిజనాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు.

వివరాలు 8లో ▸

లాకర్ అందజేత

మల్లికార్జున స్వామి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన మాజీ ధర్మకర్త ఎర్రగొల్ల మల్లేశ్ లాకర్ బహూకరించారు.

వివరాలు 8లో ▸



మెదక్‌కు నేడు హరీశ్‌రావు

మెదక్ మున్సిపాలిటీ: ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మెదక్‌లో పర్యటించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

రేపటి నుంచి అల్పాహారం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ, ఎంపీపీ

శివ్వంపేట(నర్సాపూర్): జిల్లాలోని రెండు ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 6 నుంచి అల్పాహార పథకం అమలు చేస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. బుధవారం మండల పరిధి చిన్నగొట్టిముక్క ఉన్నత పాఠశాలలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎంపీపీ కల్లూరి హరికృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. అల్పాహార పథకం ట్రయల్‌రన్‌లో భాగంగా మెదక్ బాలికల, చిన్నగొట్టిముక్కలోని ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసినట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యేలు పథకాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. దసరా సెలవుల అనంతరం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందివ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చనాయక్, సర్పంచ్ బాలమణి ఉన్నారు.

భిక్షాటనతో నిరసన



భిక్షాటన చేస్తున్న ఆశావర్కర్లు

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వం తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ బుధవారం పేటలో ఆశా వర్కర్లు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మ, సౌందర్య, యశోద, అరుణ, సుశీల, గంగమణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు..



రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: రాష్ట్రస్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ అండర్ 14 వాలీబాల్ జట్టుకు మండలంలోని జక్కపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు దుర్గాప్రసాద్, కార్తీక్, సమీర్, హామన్ ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, పీడీ అశోక్ అభినందించారు.

సమ్మెలో 104 ఉద్యోగులు



సమ్మెలో పాల్గొన్న 104 ఉద్యోగులు

మెదక్ కలెక్టరేట్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ 104 ఉద్యోగులు బుధవారం మెదక్ కలెక్టరేట్ వద్ద నిరవధిక సమ్మె చేపట్టారు. వీరికి సంఘీభావం తెలిపిన సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్ మాట్లాడుతూ 104 ఉద్యోగులకు పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హత ఉన్నవారిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. అలాగే సెకండ్ ఏఎన్‌ఎంలుగా గుర్తించాలన్నారు. ఇచ్చిన ఆప్షన్ ప్రకారం సొంత జిల్లాలోనే ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. హెల్త్‌కార్డు, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లను కంప్యూటర్ ఆపరేటర్లుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో రాజు, భూపతి, అవినాష్, రమేష్, రవి, సంజయ్, నూరుద్దీన్, మధు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ప్రోత్సాహం



చేప పిల్లలను వదులుతున్న అధికారి

మనోహరాబాద్(తూప్రాన్): చేపల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, దీని ద్వారా చాలామంది ఉపాధి పొందుతున్నారని జిల్లా మత్స్యశాఖ అధికారి రజని పేర్కొన్నారు. ఏడీ మనోహరాబాద్ మండలం కూచారం గ్రామ చెరువులో బుధవారం ఆమె చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో పురం మహేష్, ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, మండల ముదిరాజ్ అధ్యక్షుడు దాసరి నరేష్, కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి తదితరులున్నారు.

స్వచ్ఛతతో ఆరోగ్యం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ జానకీరాం సాగర్

- యాంటీ లార్వా స్ప్రే ద్వారా దోమల నివారణ
- నెలకు మూడుసార్లు కార్యక్రమం
- ప్రతి ఆదివారం స్పెషల్ డ్రైవ్
- మురుగు కాల్వల్లో చెత్త వేయకూడదు
- మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్

దోమల బెడద తొలగించడానికి యాంటీ లార్వా స్ప్రే చేయిస్తాం. ప్రతీ వీధిలో నెలకు మూడుసార్లు ఈ కార్యక్రమం నిర్వహిస్తాం. అదేరోజు సాయంత్రం ఫాగింగ్ చేయిస్తాం. ప్రతీ ఆదివారం పట్టణంలోని అన్ని వార్డుల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గుంతలు, పాడైపోయిన టైర్లలో నిలిచిన నీటిని తొలగిస్తాం. మురికి కాలువల్లో చెత్త వేయవద్దు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటాం. – జానకీరాం సాగర్, మున్సిపల్ కమిషనర్

సాక్షి ఫోన్ ఇన్

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఉదయం 10 నుంచి 11గంటల వరకు కమిషనర్ జానకీరాం సాగర్‌కు ప్రజలు ఫోన్ చేసి తమ సమస్యలు వివరించారు. ప్రధానంగా దోమల నివారణ, కోతులు, కుక్కల బెడద, పిచ్చి మొక్కలు, డ్రైయినేజీ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టక దోమలు విజృంభిస్తున్నాయి.

–గణేష్, పిట్లంబేస్

కమిషనర్: వీధుల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

చమన్‌రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లను కూల్చివేశారు. రోడ్డు వేయడం లేదు.. మురికి కాల్వలు కట్టడం లేదు. దీంతో పందుల కారణంగా దోమల బెడద తీవ్రంగా ఉంది. ప్రజలు డెంగీ, మలేరియా బారిన పడుతున్నారు.

–మహిపాల్, పిట్లంబేస్

కమిషనర్: ఇప్పటికే వీధిలో యాంటీ లార్వా స్ప్రేతో పాటు ఫాగింగ్ చేయించాం. మళ్లీ చేయిస్తాం.

రోడ్లపై చెత్త కుప్పలు పేరుకుపోయాయి. వాటిపై కోతులు గుమిగూడి ప్రజలను ఇబ్బందికి గురిచేస్తున్నాయి. పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టడం లేదు.

–ఆవారి భరత్ ఫత్తేనగర్

కమిషనర్: పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. త్వరలో కోతుల సమస్యను పరిష్కరిస్తాం.

మురికి కాల్వలు సక్రమంగా శుభ్రం చేయడం లేదు. పందులు, ఈగలు, దోమలు పెరిగి జనం వ్యాధులు బారినపడుతున్నారు. స్వీపింగ్ మిషన్‌తో రోడ్డు సక్రమంగా శుభ్రం చేయడం లేదు. మధ్యలో మాత్రమే శుభ్రం చేస్తున్నారు. ఇరువైపుల చెత్త అలాగే ఉంటుంది.

–రాకేష్, చమన్‌వీధి

కమిషనర్: రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు రావడం లేదు. టెండర్లు పిలుస్తున్నాం. పందులు, కోతుల సమస్యను పరిష్కరిస్తాం. పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

ఫతేనగర్ వీధి సినీమ్యాక్స్ టాకీస్ వెనక పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టడం లేదు. దోమలు ఎక్కువగా వస్తున్నాయి.

–మన్సూర్ హైమద్,

కమిషనర్: సిబ్బందిని పంపిస్తాం. సమస్య ఎక్కడ ఉందో చూపండి. పరిష్కరిస్తారు.

అంబేడ్కర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్ వద్ద పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగాయి. కుక్కలు, కోతులు, పందులు బెడద తీవ్రంగా ఉంది.

–అక్కమొల్ల కుమార్, అంబేడ్కర్ కాలనీ, గోల్కొండవీధి

కమిషనర్: కుక్కలు, కోతులు, పందుల నివారణకు చర్యలు చేపడుతాం.

–చందు, అజంపురా

కమిషనర్: ఇప్పటికే అజంపురా వీధిలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతోపాటు ఫాగింగ్ చేయడం జరిగింది. మరోసారి చర్యలు చేపడుతాం. వీధులు సక్రమంగా శుభ్రం చేయాలని సిబ్బందికి సూచిస్తాం.

మురికి కాల్వల్లో తీసిన చెత్త కుప్పలు తొలగించడం లేదు. –లక్ష్మణ్, గోల్కొండ వీధి

కమిషనర్: సిబ్బందిని పంపిస్తాం. సమస్య పరిష్కరించేలా చర్యలు చేపడుతాం.

రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త వేసి కాల్చుతున్నారు. వారిపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదు. కోతులు, కుక్కలు కారణంగా తీవ్ర ఇబ్బంది అవుతుంది. –బాల్‌రాజ్, గోల్కొండవీధి.

కమిషనర్: ఎక్కడపడితే అక్కడ చెత్తను కాల్చవద్దని సిబ్బందికి సూచిస్తాం. కోతులు, కుక్కల నివారణకు త్వరలోనే కార్యక్రమం చేపడుతాం.

నవాబుపేట వీధికి వెళ్లేదారిలో ఒక ఇంటి వారు మురికి నీరంతా రోడ్డుపైకి వదులుతున్నారు. దీంతో నడవలేని పరిస్థితి నెలకొంది.


–చదల్ ప్రవీణ్ కుమార్, 13వ వార్డు గోల్కొండవీధి

కమిషనర్: సిబ్బందిని పంపించి తక్షణ చర్యలు చేపడుతాం.

4,34,275

జిల్లాలో ఓటర్లు

- మెదక్ నియోజకవర్గంలో 2,14,064
- నర్సాపూర్ నియోజకవర్గంలో 2,20,211
- ఓటరు తుది జాబితా విడుదల చేసిన కలెక్టర్



మెదక్ కలెక్టరేట్: జిల్లా ఓటరు తుది జాబితాను కలెక్టర్ రాజర్షిషా బుధవారం విడుదల చేశారు. మొత్తం 434275 మంది ఓటర్లు ఉండగా మెదక్ నియోజకవర్గంలో 214064 మంది, నర్సాపూర్ నియోజకవర్గంలో 220211 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 209927 పురుష ఓటర్లు, 224337 మంది మహిళా ఓటర్లు 11మంది థర్డ్ జెండర్లు ఉన్నారు. అలాగే 34వ అసెంబ్లీ నియోజకవర్గంగా మెదక్‌ను ఎంపిక చేయగా, 274 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. నియోజకవర్గంలో పురుషులు 102340, మహిళలు 111720, థర్డ్ జెండర్ నలుగురు ఓటర్లు ఉన్నారు. ఎన్‌ఆర్‌ఐలు ఎనిమిది మంది ఉండగా అందులో పురుష ఓటర్లు ఏడుగురు, మహిళా ఓటర్లు ఒకరు ఉన్నారు. సర్వీస్ ఓటర్లు 85మంది ఉండగా సభ్యులు 84మంది స్పౌజ్ 1 ఉన్నారు. 37వ అసెంబ్లీ నియోజకవర్గంగా నర్సాపూర్‌ను ఎంపిక చేయగా 305 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. నియోజకవర్గంలో 220211 మంది ఓటర్లు ఉండగా, 107587మంది పురుష ఓటర్లు, 112617మంది మహిళా ఓటర్లు, ఏడుగురు థర్డ్ జెండర్స్ ఉన్నారు. అలాగే ఎన్‌ఆర్‌ఐలు పురుష ఓటరు ఒకరు ఉన్నారు. సర్వీస్ సభ్యులు 37మంది స్పౌజ్ ఇద్దరు ఉన్నారు.

మోదీ కృషితోనే పల్లె దవాఖానాలు



పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): ప్రధాని నరేంద్రమోదీ కృషితోనే పల్లె దవాఖానాల ఏర్పాటవుతున్నాయని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో రూ.20 లక్షల నిధులతో నిర్మించిన పల్లె దవాఖానాను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదు వేల జనాభాకు ఒక ఆస్పత్రి ఉంటే మెరుగైన వైద్య సేవలు అందుతాయని మోదీ పల్లె దవాఖానాలను ఏర్పాటు చేయిస్తున్నారని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కేంద్ర ప్రభుత్వం 33 శాతం బిల్లును ప్రవేశ పెట్టిందని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి నాయకులు జెండాలను పక్కనపెట్టి పని చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలని మహిళలు ఎమ్మెల్యేకు విన్నవించారు. సొంత ఖర్చుతో బోరు బావిని తవ్విస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లారెడ్డి, వైస్ ఎంపీపీ రాంచంద్రం, ఎంపీటీసీ గణేష్, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, గోవింద్, గణేష్, సంతోష్‌రెడ్డి, మాజీ సర్పంచులు ప్రతాప్‌రెడ్డి, రఘువీర్ పాల్గొన్నారు.

బోరు తవ్వితే అనుమతి తప్పనిసరి

భూగర్భ జలశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్‌రావు

మెదక్ కలెక్టరేట్: వాల్టా–2002 చట్టానికి వ్యతిరేకంగా ఇష్టానుసారంగా బోర్లు తవ్వితే జరిమానా విధిస్తామని భూగర్భ జలశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో వాల్టాచట్టం ప్రగతి నివేదికపై కలెక్టర్ ఆధ్వర్యంలో చర్చించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్‌రావు, డీఎస్పీ, ఆర్డీఓ, భూగర్భ జలశాఖ ఉప సంచాలకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ జిల్లాలో ఇష్టానుసారంగా బోర్లు తవ్వితే భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందన్నారు. కొన్ని గ్రామాల్లో నీరు రాని బోరు గుంతలను పూడ్చకుండా అలాగే వదిలేస్తున్నట్లు తెలిపారు. బోరుబావులు వేసే వాహన యజమానులు తప్పనిసరిగా భూగర్భ జల కార్యాలయంలో రెండేళ్లకు ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. బోరు వేయాలనుకునే వారు తప్పనిసరిగా తహసీల్దార్, భూగర్భ జల శాఖ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. లేని పక్షంలో వాల్టా చట్టం రూల్–26 ప్రకారం లక్ష రూపాయల జరిమాన విధించడం జరుగుతుందన్నారు.

పీఏసీఎస్‌ను ఏ గ్రేడ్ లో నిలపడమే లక్ష్యం

డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్ కుమార్



మాట్లాడుతున్న డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్ కుమార్

కౌల్దారం(నర్సాపూర్): వచ్చే ఏడాది వరకు రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని బీ గ్రేడ్ నుంచి ఏ గ్రేడ్‌లో నిలపడమే ప్రధాన లక్ష్యమని, డీసీఎంఎస్ వైస్ చైర్మన్, సంఘం చైర్మన్ అరిగె రమేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కార్యాలయ ఆవరణలో రమేశ్ అధ్యక్షతన మహాసభను నిర్వహించారు. సంఘం పరిధిలోని ఆరు గ్రామాలకు చెందిన సభ్యులతో పాటు రైతులు హాజరయ్యారు. సంఘం సీఈఓ నవీన్ ప్రాథమిక నివేదికను చదివి వినిపించారు. 2023–24 యాసంగిలో 1334 మంది రైతుల నుంచి 78732.4 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి రైతులకు రూ.16,21,88,744 చెల్లించినట్లు చెప్పారు. పంట రుణాలు, ఎల్టీ లోన్ కింద మొత్తం 391 మందికి రూ.5,13,18,350 ఇచ్చినట్లు తెలిపారు. ఏడాదిలో ఫర్టిలైజర్ అమ్మకాల ద్వారా సంఘానికి రూ.2,21,226 లాభం వచ్చిందన్నారు. అనంతరం రమేశ్ కుమార్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడటమే తన ప్రధాన కర్తవ్యం అన్నారు. గతంలో ధాన్యం రవాణా,అధిక తూకం, గన్నీ బ్యాగుల కొరత తలెత్తకుండా ఇప్పటికే అధికారులతో చర్చించి ఆ దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ మహాసభలో సంఘం వైస్ చైర్మన్ మల్లేశం, ఎంపీపీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, రమేష్, దుర్గేష్, లింగన్న గారి ప్రవీణ్ రెడ్డి, జనార్దన్ గౌడ్, సాయిలు, శివయ్య, రమేష్, సంగమేశ్వర్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మాధవి రాజాగౌడ్, భూపాల్‌రెడ్డి, దుర్గేష్, సుధాకర్ పాల్గొన్నారు.



తూప్రాన్ పెద్ద చెరువుకు చేరుకున్న బోట్లు

చెరువులో బోట్ షికార్!

తూప్రాన్: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పట్టణ వాసుల కల సాకారం కానుంది. నదులు, సముద్రాల తరహాలో పట్టణ సమీపంలోని పెద్ద చెరువులో బోట్ షికారు చేయనున్నారు. బుధవారం చెరువు వద్దకు రెండు బోట్లు వచ్చి చేరాయి. వాటిని చెరువులో ట్రయల్ రన్ చేశారు. గురువారం మున్సిపల్ పాలకవర్గం సభ్యులతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు బోటింగ్‌ను ప్రారంభించనున్నారు. బోట్లు ఏర్పాటు చేసినందుకు మంత్రి హరీశ్‌రావుకు మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్, వైస్ చైర్మన్ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

పాలకులం కాదు.. ప్రజా సేవకులం

మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



ఏడుపాయలలో పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

పాపన్నపేట/ మెదక్/ కొడిపల్లి(నర్సాపూర్): పాలకుల్లా కాకుండా ప్రజా సేవకులుగా పని చేస్తామని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆయన తనయుడు రోహిత్‌లు అన్నారు. బుధవారం ఏడుపాయల దుర్గాభవాని అమ్మవారిని వారు దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. డాక్టర్ అయిన తన కుమారుడు ప్రజాసేవపై ఇష్టంతో రాజకీయాల్లోకి వచ్చాడని, మెదక్ నియోజకవర్గ ప్రజలు ఆదరించాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మాటలతోకాదు చేతలతో బుద్ధి చెబుతామన్నారు. దళితబంధు, బీసీ బంధు బీఆర్‌ఎస్ కార్యకర్తలకు ఇస్తూ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాడని అన్నారు. హైదరాబాద్‌లో విలువైన భూములు అమ్ముతూ పబ్బం గడుపుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోని రాగానే జిల్లా ప్రజల అభీష్టం మేరకు సిరిసిల్లా జోన్‌నుంచి చార్మినార్ జోన్‌లో కలిపి న్యాయం చేస్తామని మైనంపల్లి తెలిపారు.

ఘనస్వాగతం

నర్సాపూర్ మీదుగా మంబోజిపల్లి నుంచి ఏడుపాయల వెళ్లుండగా మైనంపల్లి హన్మంతరావు, ఆయన కుమారుడు రోహిత్‌లకు కాంగ్రెస్ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మంబోజిపల్లి చౌరస్తా, కొడిపల్లి వద్ద వారిని కలవడానికి కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చారు. గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావ్, యూత్ అధ్యక్షుడు ధన్‌సింగ్, ప్రశాంత్‌రెడ్డి, ఎఫ్ఎసీఎస్ చైర్మన్ రమేశ్, జీవన్‌రెడ్డి, చౌదరి సుప్రభాత్‌రావు, జీవన్‌రావు, బొజ్జ పవన్, వెంకటరమణ, కూచన్‌పల్లి మహేందర్‌రెడ్డి, మేడి గణేష్ పాల్గొన్నారు.

సూక్ష్మ గోల్డ్ వరల్డ్‌కప్



బంగారంతో తయారు చేసిన సూక్ష్మ వరల్డ్‌కప్, (ఇన్‌సెట్) శ్రీనివాస్‌చారి

పెద్దశంకరంపేట(మెదక్): నేటి నుంచి ప్రారంభం కానున్న వన్డే వరల్డ్‌కప్‌ను ఇండియా గెలవాలని ఆకాంక్షిస్తూ పెద్దశంకరంపేటకు చెందిన అవుసుల శ్రీనివాస్‌చారి బంగారంతో సూక్ష్మ వరల్డ్ కప్ నమూనాను తయారు చేశాడు. గతంలో కూడా ఆయన పలు సూక్ష్మ కళాఖండాలను తయారు చేశాడు.

వృత్తి నైపుణ్య శిక్షణ

మెదక్ కలెక్టరేట్: నిరుద్యోగులకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ వారిచే ఏర్పాటు చేసిన వృత్తి శిక్షణ కేంద్రంలో ట్రైనింగ్ ఉంటుందని తెలిపారు. 6వ బ్యాచ్ తరగతులు ప్రారంభమైనట్లు తెలిపారు. కొన్నిసీట్లు మిగిలి ఉన్నందున ఈనెల 10 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గల శిక్షణ కేంద్రంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

బూటకపు హామీలతో దగా



నార్సింగిలో మాట్లాడుతున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

కాంగ్రెస్‌పై ఎంపీ ధ్వజం

రామాయంపేట(మెదక్): బూటకపు హామీలతో కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసగిస్తున్నారని, పనిచేసే నాయకులనే ఎన్నుకోవాలని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నార్సింగి మండల కేంద్రంలో బతుకమ్మ చీరల పంపిణీ, స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ సబిత, జెడ్పీటీసీలు కృష్ణారెడ్డి, శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సుజాత పాల్గొన్నారు

పార్టీ గెలుపునకు పనిచేయాలి

చేగుంట(తూప్రాన్): బీఆర్‌ఎస్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను బరిలో ఉంటున్నానని, కార్యకర్తలు తన గెలుపు కోసం పని చేయాలని కోరారు. ఇతర పార్టీ నాయకుల ప్రలోభాలకు లొంగవద్దని సూచించారు. బీఆర్‌ఎస్ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాయంలో 42 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, 13 మందికి జీఓ 58 అర్హత పత్రాలు, 11 మందికి జీఓ 59 అర్హత పత్రాలు ఎంపీ అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మనోహర్‌రావ్, వెంకటనర్సింహారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, ఎంపీపీ మాసుల శ్రీనివాస్ చేగుంట, నార్సింగి జడ్పీటీసీలు ముదాం శ్రీనివాస్, కృష్ణారెడ్డి, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, జింక శ్రీనివాస్ పాల్గొన్నారు.